నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, శనివారం 19 అక్టోబర్ 2024
MAHABUBNAGAR NARAYANPET

# ఫ్లై ఓవర్ ఎత్తు పెంచాలి



ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, అక్టోబర్ 18 : కల్వకుర్తి, నంద్యాల జాతీయ రహదారి 167 కే నిర్మాణ పనులను శుక్రవారం ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తనిఖీ చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొల్లాపూర్ నుంచి చౌటబెట్ల గ్రామానికి వెళ్లే దారిలో ఫ్లైఓవర్ నిర్మాణం ఎత్తు చాలా తక్కువగా ఉందని భవిష్యత్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఫ్లైఓవర్ ఎత్తును పెంచాలని చౌటబెట్ల గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు వంగ రాజశేఖర్ గౌడ్, కమలాకర్ రావులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన జాతీయ రహదారి పనులను పరిశీలించారు. ఫ్లైఓవర్ పనుల వద్ద దిమ్మెల ఎత్తును పరిశీలించి భవిష్యత్ ఇబ్బందులను గ్రహించి ఫ్లైఓవర్ ఎత్తును పెంచాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



అండర్-17 బాలికల జట్టుతో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- స్పోర్ట్స్ దుస్తులు, కిట్లు పంపిణీ

గద్వాల(ఉండవెల్లి), అక్టోబర్ 18 : విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లో రాణించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. మండలంలోని పుల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 68వ స్కూల్ గేమ్ అండర్-17 బాలికల కోచింగ్ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థినులకు క్రీడాదుస్తులు, కిట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థి దశలోనే క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో దేశానికి సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. అందుకే విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి గ్రామానికి, జిల్లాకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పీఈటీ సింధూరాణి, గౌరి, పీడీ ఆనంద్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీకి రూ.39కోట్ల అదనపు ఆదాయం

- ఆక్యుపెన్సీ రేషియోలో రాష్ట్రంలో మొదటిస్థానం
- ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి



వివరాలు వెల్లడిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 18 : దసరా పండుగా సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపడంతో మహబూబ్‌నగర్ రీజినల్ పరిధి అత్యధిక ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పండగకు ప్రత్యేక బస్సులు నడపడంతో రూ.39.22కోట్ల అదనపు రాబడి వచ్చిందని, ఆక్యుపెన్సీ రేషియో 110 శాతం సాధించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించామన్నారు. అక్టోబర్ 1 నుంచి 16వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా రీజినల్ 740 ప్రత్యేక బస్సులు నడిపించి 69.83 లక్షల మందిని గమ్యస్థలానికి చేర్చామని తెలిపారు. అక్టోబర్ 14వ తేదీన ఒక్కరోజే రూ.3.33కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. అదనపు ఆదాయానికి కృషి చేసిన డ్రైవర్, కండక్టర్లు, సిబ్బంది సహకరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం శ్యామల, లక్ష్మీధర్మ, మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రోత్సాహం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



మూసాపేటలో దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్‌తో మారుతీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రతినిధులు

మూసాపేట, అక్టోబర్ 18 : నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మూసాపేట మండల కేంద్రంలో శుక్రవారం మారుతీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని నందిపేటకు చెందిన సీహెచ్ యాదగిరి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ స్థిరపడి, స్థానికంగా కూడా రియల్ ఎస్టేట్ రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మూసాపేటలో కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టి శేఖర్, మాజీ ఎంపీపీ నాగార్జునరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనర్సింహులుతో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, వ్యాపార వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలేపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

జడ్చర్ల, అక్టోబర్ 18 : మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీలో గతంలో పనిచేసి రూ.1.73 కోట్ల అక్రమాలకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శి శివప్రకాశ్‌ను అధికారులు సస్పెన్షన్ చేశారు. పోలేపల్లి పంచాయతీలో అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా డీఎల్‌పీవోను విచారణ అధికారిగా నియమించారు. డీఎల్‌పీవో పోలేపల్లి జీపీలో పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను కలెక్టర్‌కు పంపించారు. అయితే ఈ విచారణలో రూ.1.73 కోట్ల అక్రమాలు జరిగాయని డీఎల్‌పీవో విచారణలో తేలిన నేపథ్యంలో గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శివప్రకాశ్‌ను అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే శివప్రకాశ్ ప్రస్తుతం హన్వాడ మండలం అమ్మాపూర్ తండాలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు.



- వనపర్తి జిల్లాలో 1.15 లక్షల టన్నుల సీఎంఆర్ పెండింగ్
- ప్రతి నెలా గడువు పెంచుతున్నారే తప్పా.. ప్రయోజనం శూన్యం
- తాజాగా 30వ తేదీ వరకు ధాన్యం ఇవ్వాలని ఆదేశాలు
- మిల్లర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట
- రూ.కోట్లు ప్రభుత్వ సొమ్మును దండుకుంటున్న యజమానులు
- ఈ సీజన్‌లో ఎన్ని మిల్లులు అర్హత సాధిస్తాయో?

# షరా మామూలే..!

వనపర్తి, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని నల్లబజారుకు దర్జాగా తరలించిన రైస్‌మిల్లర్ల యజమానులు ఇప్పటికీ తీరు మార్చుకోవడం లేదు. 2020 నుంచి సీఎంఆర్ ధాన్యం పక్కదారి పడుతున్నది. జిల్లాలోని మెజార్టీ రైస్‌మిల్లులు సీఎంఆర్ ఇవ్వకుండా ప్రభుత్వానికి లక్షలాది టన్నుల ధాన్యం బకాయిలు పడ్డాయి. 2024-25 సీజన్‌కు సంబంధించి ఒక్క రైస్ మిల్లు అయినా సీఎంఆర్ కేటాయింపులకు అర్హత పొందుతుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో రైస్ మిల్లర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా నడుస్తున్నది. ప్రజల సొమ్ము.. పరులపాలు అన్నట్లు సీఎంఆర్ వ్యవహారం కొలిక్కి రావడంలేదు. నాలుగేండ్లుగా సీఎంఆర్‌ను ఇవ్వకుండా యథేచ్ఛగా మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. కొందరు అవినీతి అధికారుల ప్రోత్సాహంతో అడ్డదారుల్లో మిల్లులకు కేటాయింపులు చేసుకొని అందినకాడికి దండుకుంటున్నారు. దీంతో లక్షలాది టన్నుల సీఎంఆర్ ధాన్యం పెండింగ్‌లో ఉంటున్నది. వనపర్తి జిల్లాలో 172 రైస్ మిల్లులున్నాయి. వీటిలో సక్రమంగా నడుస్తున్నవి మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రభుత్వం మిల్లులకు కేటాయించిన ధాన్యంలో మర ఆడించి 67 శాతం బియ్యం ఇవ్వాలి.. కానీ ఈ నిబంధనను మెజార్టీ మిల్లులు పాటించడం లేదన్నది సుస్పష్టంగా అర్థమవుతున్నది.

**గతేడాది 1.15 లక్షల టన్నులు..**

2023-24లో రెండు సీజన్లకు కలిపి 1.15 లక్షల టన్నుల సీఎంఆర్ బియ్యం మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సి ఉన్నది. వానకాలంలో 1.91 లక్షల టన్నుల బియ్యాన్ని 82 మిల్లులకు కేటాయిస్తే.., కేవలం 58వేల టన్నులు మాత్రమే వచ్చాయి. ఇంకా 70వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం ప్రభుత్వానికి రావాల్సి ఉన్నది. అలాగే యాసంగికి సంబంధించి 61వేల టన్నుల బియ్యం రావాల్సి ఉండగా.. 16,000 మెట్రిక్ టన్నులు మాత్రమే చెల్లించారు. ఇంకా 45వేల టన్నుల బియ్యం బకాయిలున్నవి. ఇలా వానకాలం, యాసంగిలో కలిపి 109 మిల్లులకు కేటాయింపులు చేశారు. బకాయిలు పడ్డ మిల్లుల నుంచి వసూలుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా మిల్లర్ల యజమానులు మాత్రం నత్తనడకన కదులుతున్నారు. ఇలా దాదాపు రూ. 540 కోట్ల విలువ చేసే బియ్యాన్ని మిల్లర్లు మింగేశారు.

**30 వరకు అవకాశం..**

సీఎంఆర్ బకాయి పడిన మిల్లులకు గడువు తేదీ పొడిగింపు కొనసాగుతుందే తప్పా.. అనుకున్న స్థాయిలో బియ్యం మాత్రం ప్రభుత్వానికి రావడం లేదు. ప్రతినెలా రెండు సమీక్షలు, బకాయిల గడువు ముగిసినప్పుడల్లా పొడిగింపులు షరామామూలుగానే సాగుతున్నాయి. 2023-24 వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి ఈ నెల 30వ తేదీ వరకు 1.70 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయిలను పూర్తి చేయాలని ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించింది. కనీసం ఈ గడువులోపైనా బకాయిలు చెల్లిస్తారో లేదో వేచి చూడాల్సిందే మరి.

**ఈ సీజన్‌లో కేటాయింపులుండేనా..**

జిల్లాలో రైస్‌మిల్లుల వ్యవస్థ అస్తవ్యస్థంగా కనిపిస్తున్నది. ప్రభుత్వ సొమ్మును దర్జాగా పక్కదారి పట్టించి కోట్లాది రూపాయలు సొమ్ము పోగు చేసుకున్నారు. ఇందుకు కొందరు అధికారులు సైతం సహకరించి అవకాశానికి మించి దండుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా నాలుగైదు సీజన్ల నుంచి సీఎంఆర్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లకు తరలించి ఎంచక్కా మిల్లర్లు తమ వ్యాపారాలను చక్కబెట్టుకున్నారు. నిజానికి ఒక్క సీజన్‌లో సీఎంఆర్ పెండింగ్ పడితే.. ఆ మిల్లుకు మళ్లీ ధాన్యం కేటాయించొద్దు. కానీ, ఈ నిబంధనలను తుంగలో తొక్కడంతో ఇక్కడ అవినీతికి అంతులేకుండా పోయింది. ఇలా జిల్లాలోని మెజార్టీ మిల్లులన్నీ గతంలో తీసుకున్న ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ ఇవ్వడంలో బకాయిలుపడ్డారు. మరి కొద్ది రోజుల్లో ఈ ఏడాది వానకాలం సీజన్ ధాన్యం కూడా చేతికి రానున్నది. సర్కార్ సైతం కొనుగోళ్ల ఏర్పాట్లలో నిమగ్నమైంది. జిల్లాలోని 172 రైస్ మిల్లులుంటే.. ఎన్నింటికి ప్రభుత్వం ధాన్యాన్ని కేటాయించే అర్హత వస్తుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## నిబంధనల మేరకే కేటాయింపులు

గతేడాదికి సంబంధించి 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి ఉన్నది. వీటిని పూర్తి చేసేందుకు ఈ నెల చివరి వరకు అవకాశం కల్పించాం. బకాయిలు లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వానికి అప్పజెప్పిన మిల్లులకు మాత్రమే నిబంధనల మేరకు కేటాయింపులు చేస్తాం. పెండింగ్ లున్న వాటికి కేటాయింపులు లేవు. సీఎంఆర్ వసూళ్లకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం. గడవులోగా బకాయిలు పూర్తి చేస్తే.. అందులో కొన్ని మిల్లులకు కేటాయింపులు వచ్చే అవకాశం ఉన్నది.

**– ఇర్ఫాన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, వనపర్తి**

# సమస్యల స్వాగతం

- పాలమూరు యూనివర్సిటీకి కొత్త వీసీ రాకతో చిగురిస్తున్న ఆశలు



పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 18 : నాలుగు నెలల నిరీక్షణకు తెరపడింది. పీయూ ఉపకులపతికిగా ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ నియామకమయ్యారు. వీసీ నియామకంపై విద్యార్థులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తుండటంతో పాటు సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఏడాది మొదటి క్వార్టర్‌కు సంబంధించిన నిధులు మాత్రమే విడుదల కాగా.. రెండో క్వార్టర్ నిధులు మంజూరు కాకపోవడంతో బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పుడూ.. అప్పుడూ అంటూ అధికారులు కాలం దాటవేస్తున్నారు. పీయూలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ రూ.9కోట్లకు పైగా వెచ్చించి ఏర్పాటు చేసి.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించినా.. నేటికీ అథ్లెటిక్ కోచ్‌ను నియమించడం లేదు. కొత్త వీసీ పీయూ సమస్యలు తీర్చాలని విద్యార్థులు, ఒప్పంద అధ్యాపకులు, తాత్కాలిక బోధనేతర సిబ్బంది కోరుతున్నారు.

### మెస్ సదుపాయం కల్పించాలి



పీయూలో పీజీ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఎటువంటి డిపాజిట్లు లేకుండా భోజన సదుపాయం కల్పించాలి. పీయూలో మహిళా వసతి గృహంలో సరిపడా గదులు, సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా రూ.8కోట్లకుపైగా వెచ్చించి నిర్మించిన భవన నిర్మాణం పూర్తయినా.. ఫర్నీచర్ ఏర్పాటు వేగవంతం చేయాలి. మహిళా వసతి గృహం వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి.

**– వేణుగోపాల్, ఎంబీఏ సెకండియర్, పీయూ**

### ప్రతి విద్యార్థికి వసతి కల్పించాలి



పీయూలో అడ్మిషన్ పొంది వసతి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి వసతి గృహంలో ఉండి చదువుకునేందుకు అనుమతించాలి. ముఖ్యంగా ఇంజినీరింగ్, లా కళాశాలలు పీయూ క్యాంపస్‌లోనే ఏర్పాటు చేయాలి. రెగ్యూలర్ వైద్యుడిని నియమించి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి.

**– భరత్‌బాబు, బీఆర్ఎస్వీ, పీయూ అధ్యక్షుడు**

### క్రమబద్ధీకరణకు కృషి చేయాలి



దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పీయూను తీర్చిదిద్దేందుకు పదిహేనేండ్లుగా అన్ని అర్హతలు కలిగి చాలీచాలని వేతనాలతో జీవితాన్ని నెట్టుకొస్తున్న ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణకు కొత్త వీసీ సహాయ సహకారాలు అందించాలి. కేంద్రం ద్వారా మంజూరైన రూ.100 కోట్లు విద్యార్థుల యోగాక్షేమాలకు, పరిశోధన అభివృద్ధిలో కీలకమైన రంగాల్లో ఉపయోగించేలా ప్రతి ఒక్క అధ్యాపకుడు కృషిచేస్తారు.

**–డా.శ్రీధర్‌రెడ్డి, పీయూ ఒప్పంద అధ్యాపకుడు**

### జీవో నెంబర్ 60 అమలు పర్చాలి



2021లో ఇచ్చిన జీవో నెంబర్ 60 అమలు పర్చి పీయూలో పని చేస్తున్న బోధనేతర సిబ్బందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి. పీయూ పాలక మండలి అనుమతితో ప్రతి ఏటా వేతన పెంపు 12శాతం ఉండగా నిలిపివేశారు. వాటి బకాయిలు సిబ్బంది ఖాతాల్లో వెంటనే జమచేయాలి.

**– రామ్మోహన్‌జీ, పీయూ బోధనేతర సిబ్బంది యూనియన్ అధ్యక్షుడు**

## పీయూ వీసీగా జీఎన్ శ్రీనివాస్



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 18 : పాలమూరు యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ డాక్టర్ జీఎన్.శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిరిసిల్ల కొత్తపల్లి గ్రామానికి చెందిన బీసీ యాదవ వ్యవసాయ కుటుంబానికి చెందిన గొండ్లాల నర్సయ్యయాదవ్, గొండ్లాల ఎల్లవ్వ దంపతుల కుమారుడు ప్రొఫెసర్ జీఎన్.శ్రీనివాస్. ఈయన ప్రస్తుతం జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో సీనియర్ ప్రొఫెసర్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజినీర్‌గా కొనసాగుతున్నారు. ఎంటెక్ బీటెక్, పీహెచ్‌డీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేసి ఉస్మానియా యూనివర్సిటీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకయ్యారు. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జేఎన్‌టీయూ అనంతపురంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, ప్రిన్సిపాల్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా, డైరెక్టర్‌గా పనిచేశారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో జేఎన్‌టీయూ హెచ్‌లో క్రియాశీలకంగా పనిచేశారు. ఈ ఏడాది మే 21న పీయూ వీసీగా కొనసాగిన లక్ష్మీకాంత్‌రాథోడ్ మూడేళ్ల పదవీకాలం ముగియడంతో పీయూకు సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా వ్యవహరిస్తున్న అహ్మద్ నదీంను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. జూన్ 15వ తేదీ వరకు ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారని ప్రభుత్వం అప్పట్లో ఉత్తర్వుల్లో పేర్కొంది. గడువు ముగియడంతో వీసీ నియామకం జరిగే వరకు కొనసాగుతారని మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ ట్రిపుల్‌ఈ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ జీఎన్.శ్రీనివాస్ కొత్త ఉపకులపతిగా నియామకం కావడంతో ఆయనను పూర్వ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్‌రాథోడ్, పీయూ అధ్యాపకులు అభినందించారు.

## పిడుగుపాటుకు కర్ణాటక కూలీ మృతి

మరికల్, అక్టోబర్ 18 : పొట్టకూటీ కోసం కర్ణాటక రాష్ట్రం నుంచి పత్తికూలీకి వచ్చిన మహిళపై ప్రకృతి కన్నెర చేయడంతో మృతిచెందిన ఘటన శుక్రవారం కన్మనూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సం బంధించి వివరాల ప్రకారం మండలంలోని కన్మనూర్ గ్రామ శివారులో శర్నపల్లిగ్రామానికి చెందిన వారు పత్తి సాగు చేశారు. పత్తిపంటలో పత్తి తీయడానికి వచ్చిన కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ నియోజకవర్గం అనూపూర్ గ్రామానికి చెందిన 20మంది కూలీలు వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో కూలీలు చెట్ల కిందకు వెళ్లగా పిడుగుపాటుకు బోయ సంగమ్మ (45) అక్కడిక్కడే మృతిచెందగా, మల్లమ్మ, అల్లమ్మలకు గాయాలైనట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు. సంగమ్మకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. సంగమ్మ మృతితో అనుపూర్‌లో విషాదచాయలు అమలుకున్నాయి.

# జూరాలలో 11 గేట్లు ఎత్తివేత

అయిజ, అక్టోబర్ 18 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులకు వరద కొనసాగుతున్నది. శుక్రవారం జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో 11 గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు ఇన్‌ఫ్లో 70 వేల క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 85,356 క్యూసెక్కులు నమోదైంది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 48,057 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 43,173 క్యూసెక్కులు ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటి మట్టం 1705 అడుగులకు గాను 1704.72 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి గరిష్ఠ నీటిమట్టం 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 51,720 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 51,051 క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ఠ స్థాయి నీటిమట్టం 1615 అడుగులకు గానూ ప్రస్తుతం 1614.50, అడుగులు ఉంది.

**తుంగభద్ర, ఆర్డీఎస్‌కు భారీ వరద..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో 17 గేట్లు ఎత్తి 72,915 క్యూసెక్కులు తుంగభద్ర నదికి విడుదల చేస్తున్నారు. డ్యాంకు ఇన్‌ఫ్లో 83,001 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 83,001 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.500 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 53,270 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 52,600 క్యూసెక్కులు నమోదైంది.

# కాంగ్రెస్‌లో విభేదాలు

గద్వాల, అక్టోబర్ 18 : జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ప్రమాణస్వీకారం, సర్దార్ సర్వాయిపాపన్న విగ్రహావిష్కరణకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరైనా స్థానిక ఎమ్మెల్యే హాజరుకాకపోవడం కాంగ్రెస్‌లో ఉన్న విభేదాలు మరోసారి వ్యక్తమయ్యాయి. దీనికి తోడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యాక్రమానికి మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గం మాత్రమే హాజరు కాగా ఎమ్మెల్యే వర్గం హాజరు కాలేదు. విగ్రహాన్ని ఆర్అండ్‌బీ అధికారుల అనుమతి లేకుండా ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఆర్అండ్‌బీ అధికారులు విగ్రహా ఏర్పాటు స్థలాన్ని పరిశీలించి వెళ్లిపోయారు.

**ముందస్తు అరెస్ట్..**

అక్రమ అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లాకు మంత్రి వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చినటు వంటి హామీలైన రుణమాఫీ, రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని మంత్రికి వినతి పత్రం ఇవ్వడానికి బయలుదేరిన రంజిత్‌కుమార్‌ను ఇంటి వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయమని వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తే రాజ్యాంగ విరుద్ధంగా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, గోవింద్, రంగస్వామి, వెంకట్రాములు, బలరాం రాము, గట్టునాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో అనుచరులతో రంజిత్‌కుమార్

# కేఎల్ఐ డీ-82 కాల్వకు మళ్లీ గండి

- వృథాగా సాగునీరు

వెల్దండ, అక్టోబర్ 18 : మండల పరిధిలోని గుండాల -వెల్దండ గ్రామ సమీపంలో కేఎల్ఐ డీ-82 కాల్వకు మళ్లీ గండి పడింది. శుక్రవారం కాల్వ తెగడంతో సాగునీరు వృథాగా పారుతున్నది. అయితే ఇప్పటికీ ఈ వర్షాకాలం ఆరంభం తర్వాత 8సార్లు కాల్వకు గండి పడిందని స్థానికులు అంటున్నారు. గండి పూడ్చడంలో నాణ్యత లేకపావడంతో మళ్లీ కాల్వ తెగిపోతుందని ఆరోపిస్తున్నారు. కాల్వ తెగిపోవడంతో సాగునీరు వృథాగా పోతుండడంతో దిగువ నున్న పంటలు మునిగి నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వకు పకడ్బందీగా మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



వెల్దండ సమీపంలో కేఎల్ఐ కాల్వకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు